క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ, ప్రజలు

కొత్తూరు: మండల పరిధిలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఆదివారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తయ్య, ఉప సర్పంచ్ దయానంద్‌గుప్త, గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవానికి ఎంపీపీ రవీందర్‌యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, శ్రావణ్, యాదగిరిరావు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఉన్న శివాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, కౌన్సిలర్ చెట్ల పావని, నర్సింలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉమాదేవి, కత్తి చంద్రశేఖర్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

షాద్‌నగర్‌టౌన్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ ఆశ్రమంలో ఆదివారం షాద్‌నగర్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ బండారి ఆధ్వర్యంలో డాక్టర్లు చందులాల్ రాథోడ్, విజయ్‌కుమార్, శారద, అనిల్ బండారి, సురేష్, ప్రేమ్‌సాయి, కార్తికేయలు అనాథ వృద్ధులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీ వ్యవస్థాపకులు డాక్టర్ గీతా, థామస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు నిర్మాణం పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: మండల కేంద్రంలో రూ.60 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను ఆదివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పరిశీలించారు. గతంలో కొందుర్గులో ఈ రోడ్డు ఎంతో ఇరుకుగా ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండేవని అన్నారు. పెద్ద మనసుతో అందరు సహకరించి రోడ్డు వెడల్పుకు స్వచ్ఛందంగా సహకరించడం అభినందనీయమన్నారు. ప్రజల సహకారం ఉంటే మరింత అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, సుందర్, గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోట్ల ఆస్తులున్నా.. దీపానికి దిక్కులేదు

- చీమలు మలిచిన విగ్రహం
- రాజులు ఇచ్చింది 365 ఎకరాలు
- నేడు మిగిలింది 312 ఎకరాలు
- 53 ఎకరాల పొలం 'గోవిందా'
- కోర్టుల్లో మూలుగుతున్న 109 కేసులు
- అభివృద్ధికి నోచుకోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

కొందుర్గు: దేవాలయాల్లో విగ్రహాలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రాణ ప్రతిష్ఠ చేసి విగ్రహాలను ప్రతిష్ఠాపన చేస్తారు. కానీ, కొనదుర్గం(కొందుర్గు)లో మాత్రం ఓ బండరాయిపై సాక్షాత్తు శ్రీలక్ష్మీనరసింహస్వామి రూపాన్ని చీమలే మలిచాయని పూర్వీకుల నుంచి కథలు కథలుగా చెప్పుకుంటారు. అలాంటి దేవాలయ ఆలనాపాలన కోసం నాటి రాజులు 365 ఎకరాల పొలాన్ని దేవాలయానికి ఇవ్వగా నేడు 312 ఎకరాలు మిగిలింది. ప్రస్తుతం దేవుడికి ఉన్న భూముల విలువ కొన్ని కోట్లల్లో ఉండగా మూలవిరాట్‌కు నిత్యపూజలు కరువై దీపం పెట్టే దిక్కులేకుండా పోయిందని కొందుర్గు వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్వీకుల చెబుతున్న చరిత్ర ఆధారంగా కొందుర్గు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ చరిత్ర తెలుసుకుందాం.

దేవాలయాన్ని నిర్మించిన బాదామీ చాళుక్యులు..

7వ శతాబ్దంలో బాదామీ చాళుక్యులు తమ రాజ్యాన్ని దుర్గాలుగా విభజించుకొని పారిపాలన కొనసాగించేవారని స్థానికులు అంటుంటారు. ఆది దుర్గం ,అల్లా దుర్గం, కొనదుర్గం ఉండేవి. ప్రస్తుతం ఆది దుర్గం తిరుపతి ప్రాంతంలో, అల్లా దుర్గం మెదక్ జిల్లాలో ఉంటుందని చివరకు ఉన్న దుర్గాన్ని కొన



పెండ్యాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

దుర్గంగా పిలిచే వారని చెబు తుంటారు. నాటి కొన దుర్గమే నేటి కొందుర్గుగా మారింది. అప్పట్లో కొన దుర్గానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పెండ్యాల గ్రామంలోని గుట్టపైన ఓ బండరాతిపై చీమలు మలిచిన విగ్రహం ఉన్నట్లు తెలుసుకున్న ఆనాటి చాళుక్య రాజులు స్వామివారి దేవాలయాన్ని నిర్మించారు.

ఆలయం ఆవరణలో గుప్తనిధుల వేట..

పూర్వకాలంలో నిర్మాణం చేసిన దేవాలయం కావడంతో దేవాలయం ఆవరణలో నిధులు ఉన్నాయనే ఆలోచనతో గుప్తనిధుల వేట కొనసాగుతుంది. తరుచుగా రెండు మూడు నెలలకు ఓసారి దేవాలయంలో తవ్వకాలు జరుగుతూనే ఉంటాయి.

దేవాలయ భూముల్లో వెలసిన గ్రామం...

కొందుర్గు పడమర సర్వేనెంబర్ 15/అలో 13 ఎకరాల 27 గుంటల భూమిలో లూర్దునగర్ అనే గ్రామం వెలసింది. అలాగే మండల కేంద్రంలో ఉన్న దేవాలయ భూముల్లో అనుమతి లేకుండా



చాళుక్యుల చిహ్నం

పక్కా గృహాలను నిర్మాణం చేసుకోవడంతో దేవాదాయ శాఖ వీరిపై 109 కేసులు వేయగా దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ కోర్టు 2022 డిసెంబర్ 12న 39 కేసులకు దేవాలయానికి అనుకూలంగా తీర్పువచ్చినట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారు.

భూముల వేలం ద్వారా సాలీనా రూ.5 లక్షలకుపైనే ఆదాయం

దేవాలయానికి సంబంధించి 180 ఎకరాల భూములను ప్రతిఏటా రైతులు సాగుచేసుకోవడం కోసం ఎండోమెంట్ ఆధ్వర్యంలో వేలం వేస్తారు. దీంతో సాలీనా రూ. 5 లక్షలకు ఆదాయం వస్తుంది. ఈ డబ్బులతో కొందుర్గు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవాలయ నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠ, ప్రహరీగోడ నిర్మాణం వంటి పనులు చేయడంతో పాటు స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్నారు. కానీ పెండ్యాల దేవాలయం అభివృద్ధి మాత్రం సాగడం లేదు.

"పూర్వ వైభవం తేవాలి



లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలి. దేవాలయం అభివృద్ధికి పాటుపడేవారిని కమిటీ సభ్యులుగా నియమించాలి. నేను దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే 2007 సంవత్సరంలోనే 23 విగ్రహాలు కావాలని తిరుమల తిరుపతి దేవస్థానం వారికి ప్రతిపాదనలు పంపించాం. నేటికి విగ్రహాలు తేలేదు.

–లక్ష్మయ్య, దేవాలయ కమిటీ మాజీ చైర్మన్, కొందుర్గు

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం..



ప్రతిఏటా భూముల ద్వారా వస్తున్న ఆదాయంతో కొందుర్గు దేవాలయంలో పూజలు నిర్వహించడంతో పాటు దేవాలయాన్ని పునర్నిర్మించాం. పెండ్యాల దేవాలయ అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే దేవాలయం వరకు రోడ్డు ఏర్పాటు చేస్తాం. దేవాలయ అభివృద్ధికి సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటాం.

–గోపాల్, దేవాలయ కమిటీ చైర్మన్, కొందుర్గు

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న అంజయ్య

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన డాక్టర్ అంజయ్య తన తండ్రి కృష్టయ్య జ్ఞాపకార్థం రూ.51వేల విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేష్‌గుప్త, వెంకటయ్య, ఎంపీటీసీ శ్రీశైలం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

కేశంపేట: మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ వీరేందర్ రెడ్డి ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో తెలంగాణ డయాగ్నోస్టిక్ అసోసియేషన్ షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అరవింద్ కుమార్, ఉపాధ్యక్షుడు అమర్, సురేష్, శ్రీనివాస్, అశోక్, వీరేందర్‌చారి, రాజేష్, పరమేష్ పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్ రెడ్డి

నందిగామ: గత ఎన్నికల హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్ రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని మేకగూడలో బీజేపీ నేత భాను ప్రసాద్ అధ్యక్షతన ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీవర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బాగుపడిందని, రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. ఎన్నికల ముందు కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని మండిపడ్డారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం ఏమైందని ప్రశ్నించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు లేవని, చేసిన



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్ రెడ్డి

పనులకు బిల్లులు రావడం లేదని సర్పంచులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన, సురక్ష బీమా, ఫసల్ బీమా తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేపల్లి అశోక్‌గౌడ్, సుధాకర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రవాణారంగ సమస్యలు పరిష్కరించాలి



కేంద్ర సహాయ మంత్రిని కలిసిన సయ్యద్ సాధిక్

షాద్‌నగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సాధిక్

షాద్‌నగర్: రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని షాద్‌నగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సాధిక్ డిమాండ్ చేశారు. బెంగుళూరులో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు సమావేశాలకు ఆదివారం షాద్‌నగర్ నుంచి లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు వెళ్లారు. ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ... కరోనా నేపథ్యంలో రవాణా రంగం పూర్తిగా కుదేలయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మోటార్ వెహికల్ యాక్టును రద్దు చేయాలన్నారు. అదేవిధంగా వాహనదారుల నుంచి గ్రీన్ ట్యాక్స్ పేరుతో అధిక మొత్తంగా ప్రభుత్వం డబ్బులు వసూలు చేస్తున్నారని, దీంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫెనాల్టీలను రద్దు చేసి పాత పద్ధతిలోనే వాహనాలకు ఫిట్‌నెస్ చేయాలని వివరించారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకోవాలని, రోజు రోజుకు ఇంధనం ధరలు పెంచుతుండడంతో వాహనాలు నడపలేక అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి వసూలు చేసే రుసుమును తగ్గించాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా వాహనాలు వెళ్లడానికి వీలుగా ప్రభుత్వం సింగిల్ పర్మిట్ ఒప్పందం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వాహనాలకు పెంచిన బీమా ప్రీమియాన్ని తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కేంద్ర సహాయ మంత్రి వీకే సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమావేశానికి వెళ్లిన వారిలో నవాజ్ గోరి, కాలేద్, షాహిద్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన తన జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు, పథకాల గురించి కూడా ప్రజలకు వివరముగా తెలియజేయాలని చెప్పారు. కేవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు 18 మందిని గుర్తించి వారికి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గం నాయకులు వర్రి తులసీరామ్ విజయ్‌కుమార్, కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు పాండురంగారెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డి, దళిత మోర్చా మండల అధ్యక్షుడు అశోక్, చేవెళ్ల బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, సురేష్, జిల్లా నాయకులు నితిష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని మోకిల గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సీఎం కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేశ్, బీజేవైఎం మండల కార్యదర్శి లింగం యాదవ్, నాయకులు కృష్టారెడ్డి, నర్సింహారెడ్డి, నరేశ్, మహిపాల్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

వైద్యుడు హరిప్రసాద్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తూరు: మారుతున్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యం కారణంగా ఇటీవల కాలంలో ప్రజలు ఎక్కువగా అనారోగ్యాలకు గురవుతున్నట్లు హైదరాబాద్‌లోని ప్లూటస్ ఆస్పత్రి వైద్యుడు హరిప్రసాద్ అన్నారు. మండలంలోని ఎస్‌బీపల్లి గ్రామంలో ఆదివారం ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితవైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు వైద్యులు ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించారు. తాజా కూరగాయలు, తగినంత వ్యాయామం, యోగా చేయడంతో అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చని వారు ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు శారద, అహ్మద్ ఇమ్మాత్ సిరాజ్, స్థానిక నాయకులు రాఘవేందర్, శ్రీను, కోటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థి



ప్రశంసాపత్రం అందుకుంటున్న నాహీద్

కొందుర్గు: న్యూమాంక్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ అంబేడ్కర్ జగ్జీవన్‌రావు హాల్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే టోర్నమెంట్‌లో కొందుర్గు విద్యార్థి ఎండీ నాహీద్ అండర్–12 కటాస్ బాలికల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు రంగారెడ్డి జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రాక్టర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా అక్కడి న్యూమాంక్స్ కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ కమల్ భాష నాహీద్‌కు ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థిని కుంగ్‌ఫూ అసోషియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌పటేల్, కొందుర్గు మండల అసోషియేషన్ అధ్యక్షుడు శివకుమార్ అభినందించారు.

ఆలయ హుండీ లెక్కింపు

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి శివాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధిచి ఆలయ హుండీని ఆదివారం లెక్కించారు. ఆలయ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మాకం పాండయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కార్యదర్శి మల్లారెడ్డి సమక్షంలో ఆలయ నిర్వాహకులు హుండీని లెక్కించారు. రూ.5,96,000 ఆదాయం వచ్చినట్లు అధ్యక్షుడు పాండయ్య చెప్పారు.

యువత క్రీడల్లో రాణించాలి



ప్రతాప్‌రెడ్డిని సన్మానించి, జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బిన్ని మిల్స్ వారి ఆధ్వర్యంలో మూడవ గ్రామీణ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. యువత క్రీడల్లో రాణించి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు. క్రీడలు మనిషి జీవితంలో భాగమైపోయాయని అన్నారు. క్రీడలు ఆడడం ద్వారా ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మధు, టోర్నీ నిర్వాహకులు సంజీవరెడ్డి, రాజు, ఇన్నాతి మహేందర్, రాయల్ రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న వెంకటేశ్

బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, జనవాడ గ్రామ వార్డు సభ్యుడు గొడిచర్ల వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం నూతనంగా ఏర్పడిన శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారం, సొంత నిధులతో నూతన ట్రాన్స్‌ఫార్మర్, కాలనీకి సరిపడే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. అలాగే, గ్రామంలో దాతల సహకారంతో సీసీ రోడ్లను కూడా వేశామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నర్సింహా , జైపాల్, బీఆర్ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు వడ్ల నాగరాజు, నాయకులు వీరయ్య, గోపాల్, మమేష్, జంగయ్య, బాగయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

సర్పంచ్ శైలజ

చేవెళ్ల: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ బండారి శైలజఆగిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ పుష్కరిణీ వద్ద జాతరకు వచ్చిన ప్రజలు వేసిన చెత్త చెదారాలను చేవెళ్ల సంత్ నిరంకారీ సత్సంగ్ ఆధ్వర్యంలో పరిశుభ్రం చేసే కార్యక్రమాలను నిర్వహించారు. సంత్ నిరంకారీ సత్సంగ్ వారి ప్రాజెక్ట్ అమృత్ కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన మనస్సు అనే కార్యక్రమాన్ని సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని జాతర ఉత్సవాల భాగంగా ఆలయ పరిసరాలు చెత్త చెదారంతో నిండిపోయాయని చెప్పారు. గ్రామ పంచాయతీ ద్వారా పరిశుభ్రం కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ జాతరకు జనం ఎక్కువగా రావడంతో అపరిశుభ్రంగా మారుతునే ఉన్నారు. స్వచ్ఛందంగా సంత్ నిరంకారీ సత్సంగ్ చేవెళ్ల మండల శాఖ సభ్యులు ముందుకు వచ్చి వారి



శుభ్రం చేస్తున్న సంత్ నిరంకారీ సభ్యులు

ప్రాజెక్ట్ అమృత్ పేరుతో పారిశుద్ధ్యం కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పుష్కరిణి పరిసరాలలో జాతరకు వచ్చిన ప్రజలు సేద తీరి అక్కడే వంట వార్పు చేసుకొని ఉండడంతో పెద్ద ఎత్తున చెత్త చెదారం పెరుకుపోయిందని చెప్పారు. దీనిని సంత్‌నిరంకారీ సత్సంగ్ సభ్యులు పుష్కరిణి పరిసరాలను పరిశుభ్రంగా చేశారు. ఈ సందర్భంగా సంత్ నిరంకారీ సత్సంగ్ చేవెళ్ల మండల శాఖ అధ్యక్షుడు మాణిక్యప్రభు ఆధ్వర్యంలో పనిచేసిన బృందం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సత్సంగ్ సభ్యులు ఉన్నారు.

ముగిసిన వారణాసి రామయ్య ఉత్సవాలు

మొయినాబాద్‌రూరల్: సాంస్కృతిక వీధి నాటకాలతో మూడు రోజులుగా సాగిన వారణాసి రామయ్య ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. కనకమామిడిలోని దత్తాత్రేయ ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక పౌరాణిక నాటకాలకు ఎప్పుడు చక్కటి ఆదరణ లభిస్తుంది. దీంతో ఆదివారం ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, పలువురు ప్రముఖులు వీధి నాటకాలు వేసిన కళాకారులు, తెలంగాణ భాషా సంస్కృతిక హైదరాబాద్ చలన చిత్ర టీవీ రంగస్థల అభివృద్ధి ఆలయ భక్త బృందం సభ్యులను ఘనంగా సన్మానించారు. లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటి కాలంలో వీధి నాటకాలు ప్రజలను ఎంతో అలరింపజేసేవన్నారు. షాద్‌నగర్ కళాజ్యోతి బృందం వేసిన వీధి నాటకాలు అందరిని ఆకట్టుకున్నాయని తెలిపారు. సెన్సార్ బోర్డు టీవి రంగయ్య మాట్లాడుతూ.. నాటకాలను ఒక తెలుగు సినిమా విధంగా చూపించారన్నారు. హార్మోనియం సహకారం డాక్టర్ చంద్రబాబునాయుడు, తబల శశిభూషణచారి, హిందుస్తానీ డిప్లొమా మేకప్ సురభి జయప్రకాష్, హైదరాబాద్ సౌండ్స్ చందు, బస్మాసురుడిగా, అంజనేయుడిగా రెండు విభిన్న పాత్రలు పోషించిన



నాటకాలు ప్రదర్శించిన వారిని సన్మానిస్తున్న చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి

రమేష్‌చారి నటన ఎంతో అపురూపమైందని కొనియాడారు. కార్యక్రమంలో అంజనేయులుయాదవ్, వీరాచారి, ప్రశాంత్‌చారి, సాయినంది, ప్రణీత్‌చారి, లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.